## గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు సన్మానం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 20 :** షాద్‌నగర్ పట్టణంలోని గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయ నూతన అభివృద్ధి కమిటీ సభ్యులను పలువురు సన్మానించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ కోశాధికారి నీల రవిగౌడ్, మీడియా సెక్రెటరీ అల్వాల దర్శన్ గౌడ్, డైరెక్టర్ ఆలోనిపల్లి రాజు గౌడ్‌లను షాద్‌నగర్ గౌడ సంఘం నాయకులు, మిత్ర బృంద: శాలువాలతో ఘనంగా సన్మానించారు. పోలేపల్లి శ్రీనివాస్ గౌడ్, నక్క మల్లేష్ గౌడ్, కొమ్మగంటి జగన్ గౌడ్, మారుతీ గౌడ్, మల్లేష్ గౌడ్, మురళీమో హన్ (అప్పి), శుక్రవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రాధాన్యం : ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**తాండూరు, జనవరి 20, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన సుమారు 110మంది లబ్దిదారులకు ఒక కోటి 10లక్షల12వేల760ల విలువైన కళ్యాణలక్ష్మి షాదీముభారక్ చెక్కులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్థానిక నేతలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిరుపేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు అబ్దుల్ రావూఫ్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.




మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

## నాణ్యమైన సిఎంఆర్ బియ్యాన్ని అందజేయాలి
### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** నాణ్యమైన సీఎంఆర్ రైసును అందజేయాలని జిల్లా అధనపు కలెక్టర్ లింగ్యానాయక్ రైస్ మిల్లర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని పౌరసరఫరాల కార్యాలయంలో ధాన్యం డెలివరీ అంశం పై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు బియ్యాని అందజేయాలన్నారు. ఈ నెల 25 లోపు 2221 టన్నుల సన్న బియ్యముతో పాటుగా 2023-24 సంవత్సరం రబీకి సంబంధించిన 5499.279 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందజేయాలని మిల్లర్లకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, ఏసిఎస్ఓ ఆర్తి నాయక్, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవరయాంజాల్‌లో ఘనంగా ఆలయ పాలకవర్గం స్వీకారం


పాలకవర్గం చైర్మన్‌గా పెండెం లక్ష్మినారాయణ(నాని), పలువురు సభ్యుల ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, పలువురు పార్టీ నాయకులు

**శామీర్‌పేట, జనవరి 20, ప్రభాతవార్త**

దేవరయాంజాల్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా పెండెం లక్ష్మినారాయణ (నాని), ధర్మకర్తలుగ పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని దేవరయాంజాల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో పాలకవర్గం ధర్మకర్తల, చైర్మన్ ప్రమాణస్వీకారం కార్యక్రమం ఘనంగ జరిగింది. దేవాదాయ,ధర్మాదాయశాఖ రంగారెడ్డి జిల్లా ఇన్స్‌పెక్టర్ కె.మోహన్‌రెడ్డి వారి చేత ప్రమాణస్వీకారం చేయించారు. దీనికి ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలకవర్గం (ధర్మకర్తలు) చైర్మన్‌గా పెండెం లక్ష్మినారాయణ(నాని), ధర్మకర్త సభ్యులుగా ఎల్లంకి భారతి, నానిగల్ల హరిగోపాల్, వలందాసు మురళిగౌడ్, గుడిసెని హరికృష్ణ, బీమిడి నీలం సంజీవరెడ్డి. తూంకుంట జగదీశ్, ఎక్స్ అఫిషియో సభ్యులుగా పూజారి కందాల సీతారామచారిలు ప్రమాణం స్వీకారం చేశారు. ఆలయానికి ఇటీవలనే ధర్మకర్తలను నియమించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ దేవరయాంజాల్ శ్రీసీతారమచంద్రస్వామి ఆలయం పూర్వం నిర్మించి ఉండటం, మంచి చరిత్ర కల్గి ఉందని అన్నారు. ఆలయానికి వందలాది ఎకరాల భూమి ఉండి సుమారు 7కోట్ల రూపాయల వరకు నిధి ఉన్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని ఆయన హామి ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి నూతన పాలకవర్గం నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఆలయ నూతన చైర్మన్ పెండెం లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఆలయ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన అందరికి దన్యవాదాలు తెలియజేశారు. అందరి సహకారంతో ఆలయ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తానని లక్ష్మినారాయణ అన్నారు. దేవాలయ రథశాలను తన స్వంత నిధులతో నిర్మిస్తానని టిపిసిసి సెక్రటరీ పీసరి మహిపాల్‌రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, డిసిసి అధ్యక్షులు ఎస్.హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ముజీబుద్దీన్, మేడ్చల్ నియోజకవర్గ ఎ.బి బ్లాక్‌ల అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, పలువురు పార్టీ అధ్యక్షులు వై.ఎస్.గౌడ్, ఎస్.శ్రీనివాస్‌యాదవ్, రమణారెడ్డి, కౌన్సిలర్లు ఎస్.మధుసూదన్‌రెడ్డి, పి.నర్సింగ్‌రావుగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచులు పి.శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌ముదిరాజ్, టి.లావణ్య శంకర్‌గౌడ్, డి.వెంకటేశ, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం తరుణ్‌గౌడ్, పలువురు నాయకులు పి.మహిపాల్‌రెడ్డి, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, పి.వీరారెడ్డి, టి.శంకర్‌గౌడ్, కె.కృష్ణారెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, పి.నర్సింహ్మారెడ్డి, జి.భస్వారెడ్డి, రవీందర్‌గౌడ్, కె.రాము పాల్గొన్నారు.

### డ్వాక్రా భవనం ప్రారంభం

**మేడ్చల్, జనవరి 20. ప్రభాతవార్త :** మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని గిర్మాపూర్ గ్రామంలో సోమవారం డ్వాక్రా భవణాన్ని స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ లావణ్య హనుమంత్‌రెడ్డితో కలిసి మున్సిపల్ చైర్మన్ దీపికా నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, హన్మంత్‌రెడ్డి, మల్లేష్ గౌడ్, సత్యనారాయణ, అంజనేయులు, రవీందర్‌రెడ్డి, విష్ణుగౌడ్, అంజిరెడ్డి, రాఘవరెడ్డి, అర్జున్, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, చంద్రయ్య గౌడ్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


గిర్మాపూర్‌లో డ్వాక్రా భవనాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ దీపికా నర్సింహారెడ్డి

# తూంకుంట రోడ్డుకు అన్నీ గుంతలే


తూంకుంట మున్సిపల్ కార్యాలయం ముందు నుంచి చెరువు వైపునకు వెళ్లె రోడ్డు గుంతల మయంగా మారిన దృశ్యం



**శామీర్‌పేట, జనవరి 20, ప్రభాతవార్త**

తూంకుంట మున్సిపల్ కార్యాలయం ముందు నుంచి చెరువు వైపునకు వెళ్లె గ్రామంలోపలి మెయిన్ రోడ్డు గుంతల మయంగా అధ్వానంగా మారి వాహనదారులకు, పాదచారులకు సైతం ఇబ్బందికరంగ మారింది. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కేంద్రంలోని గ్రామంలోపలి మెయిన్‌రోడ్డు పరిస్థితి దారుణంగా ఉండి నెలల గడుస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూంకుంట రాజీవ్‌రహదారి నుంచి గ్రామం లోపలికి మున్సిపల్ కార్యాలయం ముందు నుంచి చెరువు, బిట్స్ వద్దకు వెళ్లె రోడ్డు గ్రామ పరిధిలోపల పూర్తిగ గుంతలమయంగ మారి అభివృద్ధికి విడ్దూరంగ మారింది. గతంలో తూంకుంట మున్సిపల్ కార్యాలయం ముందు నుంచి వెళ్లె రోడ్డు మరమ్మత్తు నిర్మాణం కోసం నిధులు మంజూరు ఉన్నా ఇంత వరకు గ్రామం లోపల మాత్రం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదు. బిట్స్ వైపున నుంచి చెరువు కట్ట వరకు రోడ్డు నిర్మాణం చేపట్టి గ్రామంలో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టకుండ వదిలేశారని పలువురు వాపోతున్నారు. ఈ విషయంపై ఎన్ని సార్లు మున్సిపల్ కమిషనర్‌కు, సంబంధిత అధికారులకు తెలిపినా, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకునే వారు అంటూ లేకుండ పోయారని పలువురు వాపోతున్నారు. గ్రామంలో కనీసం తాత్కాలికంగ నైనా రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టాలని, రోడ్డుకు గుంతల వద్ద మట్టి వేసిన పరిస్థితి కూడ లేకపోవటంతో రోడ్డు అధ్వాన్నంగ గుంతల మయంగా మారిందని పలువురు వాపోతున్నారు.

ఇక మరో వారం రోజుల్లో మున్సిపల్ పాలకవర్గం (చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్ల,కోఆప్షన్‌సభ్యుల) ఐదేళ్ల పదవీకాలం కూడ ముగియబోతుంది. కనీసం ఇకనైనా ఈ రోడ్డు సమస్యను పరిశీలించి తాత్కాలికంగనైనా రోడ్డు గుంతలు పూడ్చి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని పలువురు ఆ వార్డుల ప్రజలు కోరుతున్నారు. వెంటనే మున్సిపల్ ప్రజాప్రతినిధులు, కమిషనర్, సంబంధిత అధికారులు ఈ రోడ్డు తీరును పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు. తూంకుంట మున్సిపాల్టీ అయినా ఈ రోడ్డుకు మాత్రం మోక్షం లేకుండ పోయిందని, ప్రధానంగ రాత్రి సమయంలో ఈ రోడ్డున వెళ్లాలంటేనే ప్రజలు, వాహనదారులు జంకుతున్నట్లు పలువురు పేర్కొన్నారు. తూంకుంట లోపల ప్రధాన రహదారిగ పూర్వం నుంచి ఉన్న సంగతి తెలిసిందే. మెయిర్‌రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం ముందు నుంచి చెరువు కట్ట నుంచి రోడ్డు బిట్స్‌కు వెళుతుంది. ఈ రోడ్డున వచ్చె వాహనాల రాకపోకలు కూడ అధికంగానే ఉంటాయి. ఈ రోడ్డున ఇరుపక్కల ఉన్న ఇళ్ల ప్రజలకు, రాకపోకలు నిర్వహించే వారికి రోడ్డు నరకయాతనగ మారింది. ముందస్తుగా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టటానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు పలువురు కోరుతున్నారు. తూంకుంట గ్రామంలోని 5,6,7వార్డులలో ఉన్న కొన్ని రోడ్లు కూడ అధ్వాన్నంగా మారాయి. కొన్ని రోడ్డు పరిశీలిస్తే గుంతల మయంగా, బురదమయంగా రోడ్లు దర్శనం ఇస్తూ ఉంటాయి. మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించి ఓ సారి గ్రామంలోని ప్రధాన రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తు పనులైనా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# బిఆర్ఎస్ సర్కారుపై చైర్‌పర్సన్ మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల

**మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు ఇవ్వలేదని ఆరోపణ**
**కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.60 కోట్ల మంజూరు**
**సమావేశంలో చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల**

**వికారాబాద్, ప్రభాతవార్త:** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వికారాబాద్ మున్సిపాలిటీకి ఒరిగిందేమి లేదని, మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కెటాయించలేరని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడుస్తున్న తరుణంలో మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.60 కోట్ల నిధులు మంజూరవడం సంతోషంగా ఉందని చైర్‌పర్సన్ అన్నారు. సోమవారం వికారాబాద్ మున్సిపల్ సాదారణ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. 11 అంశాలతో కూడిన ఎజెండాను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులందరికి చైర్‌పర్సన్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో వికారాబాద్ మున్సిపాలిటీ ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి చెందబోతుందని ధీమా వ్యక్తం చేశారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతోనే వికారాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కొత్తగా రూ.60 కోట్లు టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరయ్యాయని అన్నారు. మరో 10 కోట్లు ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు కానున్నాయని తెలిపారు. తాము చైర్‌పర్సన్‌గా బాద్యతలు స్వీకరించినప్పటి నుంచి ఎన్నో రాజకీయ ఒడిదుడుకులు ఎదుర్కొన్నామని, కరోనా మహమ్మారిని సైతం తట్టుకుని పట్టణ ప్రజలకు కౌన్సిల్ సభ్యులతో కలిసి సేవ చేయడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఈ నెలాఖరుకి తమ పాలకవర్గం పదవీ కాలం ముగుస్తున్న తరుణంలో ఈ సమావేశానికి ప్రత్యేకత సంతరించుకుందని పేర్కొన్నారు. తమ పదవీ కాలం ముగిసినా..పట్టణ ప్రజల సేవలో తాము, తమ సభ్యులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం, ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు క్రిష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, సురేశ్, నవీన్‌కుమార్, క్రిష్ణ, రామస్వామి, శ్రీదేవి, మాలె గాయత్రి తదితరులు పాల్గొన్నారు.


వేణుగోపాల స్వామి కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

## ఘనంగా వేణుగోపాల స్వామి కళ్యాణం
### హాజరైన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 20 :** ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామంలో రుక్మిణీ సమేత సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజ శారు.

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పూజలు**


స్వామివారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

దేవునిపల్లి గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో సోమవారం జరిగిన స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పూజారులచే తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతియేటా గ్రామంలో వేణుగోపాల స్వామి జాతరను నిర్వహించడం గొప్ప విషయమని, దేవునిపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామివారిని కొంగుబంగారంలా కొలుస్తారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, నాయకులు వీరేశం గుప్త, వెంకట్‌రెడ్డి, చందునాయక్, యాదయ్య, రవిగౌడ్, నగరం శ్రీను, యాదయ్య, రవీందర్ గౌడ్, బాలకృష్ణ, బాలరాజు, యువకులు పాల్గొన్నారు.

**బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు**


విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన వేణుగోపాల స్వామి కళ్యాణోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కళ్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువా, మెమొంటోతో విష్ణువర్ధన్ రెడ్డిని సత్కరించారు. ఆయన వెంట నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్ సింగ్, చేగు సుధాకర్, మిద్దె గణేష్, భాను గౌడ్, శ్రావణ్ గౌడ్, భాస్కర్ గౌడ్, కొట్టె మహేష్, కొట్టె నితిన్, నవీన్, మణికంఠ రెడ్డి, శివ, పవన్ పాల్గొన్నారు.

### మహా కుంభమేళాలో ఆర్యవైశ్యులు

**ఆమనగల్లు, జనవరి 20, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ ప్రాంతంలో జరుగుతున్న మహా కుంభమేళలో ఆమనగల్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీర బొమ్మ రామ్మోహన్ దంపతులు , డాక్టర్ బికుమాండ్ల శ్రీనివాస్ గుప్తా దంపతులు, బిక్కుమాండ్ల నరసింహ గుప్తా దంపతులు కుంభమేళాను సందర్శించారు. సోమవారం పవిత్ర నది స్నానమాచరించి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం గంగా నది దీప హారతిని తిలకించినట్లు రామ్మోహన్ గుప్తా తెలిపారు.


గంగానదిలో పూజలు చేస్తున్న ఆమనగల్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

# అన్ని రంగాల్లో పరిగి అభివృద్ధి చేస్తా
## ఎమ్మెల్యే టిఆర్ఆర్

**పరిగి జనవరి 20 ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన చివరి సర్వసభ సమావేశానికి ముఖ్యఅతిథిగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన పరిగి మున్సిపాలిటీకి ఐదు సంవత్సరాల నుంచి పాలన అందించిన చైర్మన్ లకు మరియు కౌన్సిలర్లకు అభినందనలు తెలియజేశారు.పరిగి మున్సిపల్ అభివృద్దే లక్ష్యంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నీటి వసతులను 15 కోట్లు, వార్డులలో సిసి రోడ్లు, 5 కోట్ల రూపాయలతో నూతన మున్సిపల్ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు... త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడతామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం, మున్సిపల్ పరిధిని పెంచడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి రైతులకు ఎకరాకు రూ.6000 రైతు భరోసా పథకం ద్వారా రైతులకు అందిస్తామని, అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తామని స్పష్టం చేశారు. పరిగి నియోజకవర్గానికి 90 కోట్ల రూపాయలను రైతు భరోసా ద్వారా రైతుల ఖాతాల్లో ఈ నెల 26 నుండి జమ చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.. మంగళవారం నుండి గ్రామ సభలు నిర్వహించి, రేషన్ కార్డులు రాని వాళ్ళ నుండి దరఖాస్తులు స్వీకరించి, మంజూరు చేస్తామని తెలిపారు... అర్హులైన ప్రతి ఒక్కరికి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను ప్రభుత్వం అందిస్తుందన్నారు.. పరిగి నుండి ప్రధాన నగరాలు షాద్ నగర్, వికారాబాద్ కు నాలుగు లేన్ల రోడ్లు 240 కోట్లతో మంజూరు అయిందని, టెండర్ పిలవడం జరిగిందన,పరిగి నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నాం అని తెలిపారు.పరిగి మీదుగా రైల్వే లైన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, సర్వే పనులు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. తుంకుల్ గడ్డ లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నానని,ప్రతి వార్డులో అభివృద్ధి కొరకు ఎమ్మెల్యే నిధుల ద్వారా పనులు మంజూరు చేయడం జరిగిందని,పరిగి పట్టణాన్ని ప్రణాళికా ప్రకారంగా అన్ని రంగాల్లో అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


సర్వసభ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం .!

**సాయిడిగ్రీ కళాశాల యాజమాన్యం నిర్వాకం**
**రెండు నెలలుగా క్లాసులు బోధించడం లేదంటూ..**
**ఆగ్రహించి కళాశాలకు తాళం వేసిన విద్యార్థులు**


కళాశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

**తాండూరు, జనవరి 20, ప్రభాతవార్త :** గత రెండు నెలలుగా చదువులు చెప్పడం లేదని ఆగ్రహించిన విద్యార్థులు కళాశాలకే తాళం వేశారు. ఈ సంఘటన సోమవారం తాండూరులో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు.. తాండూరు పట్టణంలోని శాంత్‌మహాల్ చౌరస్తా సమీపంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల కొనసాగిస్తున్నారు. కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు సంబందించి సుమారు 300మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే, కళాశాల కరస్పాండెంట్ మల్లేశం, కళాశాల ఉపాధ్యాయులకు మధ్య చోటు చేసుకున్న వేతనాల వ్యవహారంతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గత ఏడాది నవంబర్‌లో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించగా.. అప్పటి నుండి ఇప్పటి వరకు క్లాసులు నిర్వహించడం లేదంటూ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గత రెండు నెలలుగా కళాశాలలో ఎలాంటి తరగతులు నిర్వహించడం లేదని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల కరస్పాండెంట్ మల్లేశంకు ఫోన్ చేసినా స్పందించడంలేదని విద్యార్థులు వాపోయారు. యాజమాన్యం నిర్వాహకంతో విసుగు చెందిన విద్యార్థులు సోమవారం కళాశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి స్పందన రాలేదని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## ప్రజావాణితో సమస్యల సత్వర పరిష్కారం

### జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, జనవరి 20 ప్రభాతవార్త:** ప్రజావాణికి ప్రజల నుంచి వచ్చే వినతులను అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాయ సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (87) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి విన్న విస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లా అధికారులు అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. వివిధ శాఖల నుండి మొత్తం ప్రజావాణికి 87 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

### ..మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,పాల్గొన్న డిఆర్‌ఒ హరిప్రియ, జిల్లా అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 20, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే అధికారులు పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా వ్యాప్తంగ ప్రజల నుంచి 60ధరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతులను, ధరఖాస్తులను, ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. వాటిని ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని, ఆ సమస్యలను పరిష్కరించటానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండ ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ హరిప్రియ, పలువురు జిల్లా వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్ష

### ..మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి




గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,పాల్గొన్న డిఆర్‌ఓ, ఎఐ,పలువురు అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 20, ప్రభాతవార్త** ఈ నెల 26న జరిగే కలెక్టరేట్‌లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి జిల్లా సంబంధిత అధికారులతో సమీక్షించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జిల్లా వివిధ శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన కలెక్టరేట్ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించటానికి అధికారులు ఘనంగ ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీసుల గౌరవవందన స్వీకారణ, బందోబస్తు ఏర్పాటు, స్టేజి, సిట్టింగ్, పిఎ సిస్టమ్, త్రాగునీరు, పారిశుద్యం చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్దిపై సందేశం బుక్‌లెట్ తయారు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, మెడికల్ టీమ్ ఏర్పాటు, విద్యుత్ సరఫరా, ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల అధికారుల, సిబ్బంది గుర్తింపు, ప్రశంసపత్రాల పంపిణీకి ప్రతిపాదనలు, సంక్షేమ పథకాల స్టాల్స్ ఏర్పాటు, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రోటోకాల్ నిబంధనలు జిల్లా అధికారులు ఖచ్చితంగ పాటించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్‌ఓ హరిప్రియ, ఎసిపి రాములు, కలెక్టరేట్ ఎఒ రాంమోహన్, పలువురు జిల్లా సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లెడు చౌదరిగూడ, జనవరి 20,(ప్రభాతవార్త): బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీపిఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ప్రజలకు బీమా పథకాలపై అవగాహన కల్పించారు. పోస్టు ఆఫీస్‌లో రూ.755లతో 15లక్ష ప్రమాద బీమా పొందవచ్చని ఆయన పెర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ లింగంగౌడ్, నారాయణలు పాల్గొన్నారు.

## బిసిలకు రాశాధికారం వచ్చినప్పుడే నిజమైన అభివృద్ధి

**షాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** బీసీలకు రాజ్యాధికారం లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని బిసి ఐక్యవేదిక నాయకులు బర్క కృష్ణ, రాపోలు నర్సింలు అన్నారు. సోమవారం షాబాద్ ముదిరాజ్ భవన్ లో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, షాబాద్ బిజెపి నూతన మండల అధ్యక్షుడు మద్దూరి మాణయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలు సంఘటితమైనప్పుడే రాజ్యాధికారం వస్తుందని బీసీలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు తమ్మాలి రవీందర్, చేవెళ్ల స్వామి, కూర వెంకటయ్య, లింగం, మాసయ్య నర్సింలు, పాండు, శ్రీనివాస్ గౌడ్, మహేందర్, ఆనందం, సత్తయ్య, చెన్నయ్య, గౌరీశ్వర్, వెంకటేష్, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ చేయాలంటూ భారీ ర్యాలీ

**షాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ షాబాద్ లో బిఆర్ఎస్ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు కేతన రమేష్, శ్రీనివాస్ గౌడ్, రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింలు, చంద్రశేఖర్, దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు రామచందర్, శ్రీనివాస్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, నారాయణరెడ్డి, భూపాల్ రెడ్డి, మల్లేష్, వెంకట్ రెడ్డి, ముక్రంఖాన్, రైతులు పాల్గొన్నారు .

# గ్రామ సభలను ఖచ్చితంగా నిర్వహించాలి

### లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ
### సంక్షేమ పథకాల అమలుకు అధికారులు
### అంకితభావంతో పనిచేయాలి
### జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలను ఖచ్చితంగా షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేసి లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యా నాయక్ లతో కలిసి జిల్లా కలెక్టర్, జిల్లాలోని ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల నాలుగు సంక్షేమ పథకాల అమలును జనవరి 26న ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామసభలను షెడ్యూల్ వారీగా ఖచ్చితంగా సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని, ఎక్కడకూడానిర్లక్ష్యానితావులేకుండా అధికారు లందరూ అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామసభలలో ఫ్లెక్సీలు,టెంట్లు,మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని, మెడికల్ టీం అందుబాటులో ఉండాలని అన్నారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో అర్హుల జాబితాను ప్రచురించాలని, గ్రామసభల్లో వచ్చే ఫిర్యాదులపై నాలుగు పథకాలకు నాలుగు రిజిస్టర్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ సభలలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, ఎక్కువ గ్రామా పంచాయతీలు ఉన్నచోట ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మద్యాహ్నం 1.30 గంటల నుంచి 3.30 గంటల వరకు గ్రామ సభలను ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, సమస్యాత్మక సమస్యలకు సామరస్యంగా, సానుకూలంగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలలో లబ్దిదారుల జాబితాను గ్రామ సభల్లో చదివివినిపి ంచాలని అన్నారు.అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించా లన్నారు .ఎలాంటి అపోహాలు తలెత్తకుండా ప్రజలకు స్పష్టంగా వివరించాలని, ఈ మొత్తం సంక్షేమ పథకాల రోజు వారీ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామసభల తీర్మాన ప్రతులను సురక్షితంగా, ఎంతో జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, డిఎస్ఓ మోహన్ బాబు, పిడి హౌసింగ్ కృష్ణ, వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, ఎడి సర్వే ల్యాండ్ అధికారి రాంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఎంపికకు గ్రామ, వార్డుల సభలు షురూ..

### ఈ నెల 26న సంక్షేమ పథకాల పంపిణీ
### మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 20, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రకాల సంక్షేమ పథకాలను ఈ నెల 26వ తేదీన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులను అందించటానికి నిర్ణయించి నందున వాటికి లబ్దిదారులను గుర్తించటానికి ఎంపిక చేయటానికి జిల్లా వ్యాప్తంగ గ్రామీణ ప్రాంతాల్లో గ్రామసభలు, మున్సిపాల్టీల్లో వార్డుల సభలు మంగళవారం నుంచి నిర్వహించటానికి జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సందర్బంగ సోమవారం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఈ నెల 26వ తేదీన అందజేస్తున్నందున వాటి గురించి లబ్దిదారులను గుర్తించటానికి, ఎంపిక చేయటానికి ఈ నెల 21నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు, వార్డు సభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో గతంలో ధరణి ద్వారా సుమారు 79వేల ఎకరాలు రైతుబంధు అందేదని, జిల్లాలో జరిగిన సర్వే ఆధారంగ సుమారు 14వేల ఎకరాలు భూమి వ్యవసాయానికి అనుకూలంగ లేనివి తేలినట్లు, సుమారు 64వేల ఎకరాలు భూమి మాత్రమే సాగు జరుగుతున్నట్లు వివరాలు అందినట్లు తెలిపారు. వీటికి రైతు భరోసా అందించటానికి అయితే వీటిని కూడ గ్రామసభల్లో పెట్టటం జరుగుతుందన్నారు.అభ్యంతరాలు వస్తే కూడ స్వీకరించటం జరుగుతుందన్నారు. జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 12,500వరకు ధరఖాస్తులు అందినట్లు విచారణ జరిగినట్లు గ్రామసభల్లో చర్చించి లబ్దిదారులను గుర్తిస్తామన్నారు. ప్రజాపాలన, కులగణనలో వచ్చిన ధరఖాస్తులను, కొత్తగా ధరఖాస్తులు చేసుకున్నా వాటిని కూడ పరిగణలోకి తీసుకుని గ్రామసభలో చర్చించి లబ్దిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డులలో పేర్ల నమోదు, తొలగింపుల కోసం (మార్పులు,చేర్పుల) గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 30వేల వరకు ధరఖాస్తులుగా రాగ, పట్టణ ప్రాంతాల్లో సుమారు 90వేల వరకు ధరఖాస్తులు అందినట్లు, మొత్తం లక్షా20వేల వరకు ధరఖాస్తులు ఉన్నట్లు విచారణ జరిగినట్లు గ్రామసభల్లో,వార్డుసభల్లో పెట్టి చర్చించి లబ్దిదారులను గుర్తిస్తామన్నారు. రేషన్‌కార్డుల ధరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. తరువాత వచ్చిన ధరఖాస్తుల వారికి ఈ 26జనవరి తరువాత పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద వ్యవసాయ కూలీలకు 6వేల చొప్పున రెండు సార్లు ఏడాదిలో ఇవ్వటం జరుగుతుందన్నారు. జిల్లాలో 1078మంది వ్యవసాయ కూలీలు (జాబ్‌కార్డుల వారు) ఉన్నట్లుగా అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇప్పటికే గుర్తించినట్లు భూమి లేని వ్యవసాయ కూలీలుగ ఉన్నవారై ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికకు ధరఖాస్తులను పరిశీలించి విచారణలు జరిగినట్లు గ్రామసభల్లో, వార్డుసభల్లో లబ్దిదారుల ఎంపికకు జాబితా ప్రదర్శన ఉంటుందని చర్చించనున్నట్లు తెలిపారు. వార్డు ఆఫీస్‌ల వద్ద వార్డు సభలు నిర్వహించటం జరుగుతుందన్నారు.

## న్యూమాస్టర్‌మైండ్‌కు లోకమంథన్ అవార్డు



**దౌల్తాబాద్, జనవరి 20,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలం గోకఫస్లవాద్ గ్రామంలోని న్యూమాస్టర్‌మైండ్ పాఠశాలకు లోకమంథన్ 2024 సక్సెస్ మీట్ అవార్డు వచ్చింది.పాఠశాల విద్యా ర్థులు గురుకులాల్లో ఎక్కువ సీట్లు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన ందుకుగాను హైదరాబాద్‌లోని స్టాండ్లీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో లోకమంథన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ చేతుల మీదుగా అవార్డును అందు కున్నట్లు ఆపాఠశాల ప్రిన్సిపాల్ రాజఅరుణ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సతీష్ పాల్గొన్నారు.

## బిసిలు సంఘటితం కావాలి..

**షాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** బీసీలు తమ హక్కుల సాధన కోసం సంఘటితం కావాలని బీసీ సేన జాతీయాధ్యక్షులు బర్క కృష్ణ అన్నారు. మండల పరిధిలోని మన్ మర్రి గ్రామంలో ఆదివారం రాత్రి బీసీ సేన గ్రామ కమిటీని వేశారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా శ్రీకాంత్, ఉప అధ్యక్షులుగా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రాజుతోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 23శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని అన్నారు జనాభాలో అత్యధిక ఉన్న బీసీలకు స్థానిక ఎన్నికల్లో న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## గుండెపోటుతో యువకుడు మృతి

**దౌల్తాబాద్,జనవరి 20,ప్రభాతవార్త:** గుండెపోటు రావడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని చెల్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది.కుటుంబ సభ్యులు,గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం చెల్లాపూర్ గ్రామానికి చెందిన దాసరి చంద్రప్ప కుమారుడు ఓంప్రకాష్(23) సోమవారంరోజు ఉదయం పొలానికి వెళ్ళాడు.గుండెలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులకు తెలిపాడు.కుటుంబ సభ్యులు హుటాహుటిన కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెల్లారు.పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి మహబూబ్‌నగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెల్లాగా అప్పటికే చనిపోయాడని వైద్యులు నిర్దారించారు.ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## అప్పుల బా ధతో రైతు ఉరివేసుకొని ఆత్మహత్య

**దోమ.జనవరి 20 ప్రభాతవార్త.** అప్పుల బాదతో రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నసంఘటన మండల పరిదిలోని అయినాపూర్ గ్రామములో ఆదివారం నాడు రాత్రి జరిగింది,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయినాపూర్ గ్రామానికి చెందిన బ్యాగరి యాదయ్య(35) కు గ్రామములో అర్థఎకరం భూమి కలదు.ఈ భూమితో పాటు పక్కన ఉన్న పొలమునుకౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు.ఉన్న పొలములో మూడు సార్లుబోర్లు వేసి నీళ్ళు రాక పోవడంతో అప్పులపాలు అయినాడు.బోర్లు వేయడం కోసం,చేసిన అప్పులు ఎలా తీర్చాలని ప్రతి రోజు దిగులు చేందుతూ బాదపడేవాడని మృతుని బార్య అంజిలమ్మ పేర్కొంది. ఆదివారం నాడు బయటకు వెళ్ళి వస్తానని బార్య అంజిలమ్మకు చెప్పగా సాయంత్రం వరకు రాకపోవడంతో బార్య అంజిలమ్మ పోన్ చేయగా తన తమ్ముడి దగ్గర ఉన్నాని బార్యకు చెప్పి అదే రోజురాత్రి పొలము దగ్గరకు వెళ్ళిచెట్టుకు ఉరివేసుకొనిఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు .మృతునికిఇద్దరు పిల్లలు ఉన్నారు.ఈ విషయంపై మృతుని బార్య అంజిలమ్మ పోలిసులకు పిర్యాదు చేయగాకేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

## ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలు

**దోమ.జనవరి 20 ప్రభాతవార్త.** ఈ నెల 21 తేది నుండి 24 తేది వరకు మండలములోని అన్నిగ్రామాలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు యంపడివో మహేశ్‌బాబు తెలిపారు.సోమవారం నాడుదోమ మండల పరిషత్ కార్యాలయములో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, కొత్తరేషన్‌కార్డులు,ఇందిరమ్మఇండ్లు కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభల ద్వారా ఎంపిక కార్యక్రమముజరుగుతున్నట్లు తెలిపారు.

## ఆర్థిక సహాయం కోసం ఎదురుచూపులు

**శంకర్‌పల్లి, జనవరి, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణంలోని కమ్మెట గ్రామానికి చెందినటువంటి గొల్లగూడ యాదయ్య తండ్రి హనుమయ్య వయసు 50 సంవత్సరాలు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం కోసం తన యావదాస్తిని తాకట్టు పెట్టి చూయించుకున్న పూర్తిగా కోలుకోలేకపోవడంతో దాతల ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. సొంత ఇల్లు కూడా లేని పరిస్థితి పూర్తి వివరాల్లోకి వెళితే కమ్మెట గ్రామానికి చెందినటువంటి గొల్లగూడ యాదయ్య 2023 మార్చ్ 19వ తేదీన హిమాయత్ నగర్ నుండి కమ్మెట కు బైక్ పై వస్తుండగా యాక్సిడెంట్ జరిగింది. యాక్సిడెంట్ జరిగిన వెంటనే స్థానికులు అతడిని హాస్పిటల్ కి తరలించగా కోమాలోకి వెళ్లినట్లు, బ్రెయిన్ లో బ్లడ్ క్లాట్ అయినట్టు డాక్టర్లు తెలిపారు. జూబ్లీహిల్స్ లోని అపోలో హాస్పిటల్లో బ్రెయిన్ సర్జరీ చేయడం జరిగింది. కుడి చేయి కుడికాలు పక్షవాతానికి గురి కావడం తో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. హాస్పిటల్ ఖర్చులకై వైద్యం కొరకు తనకు ఉన్న అరఎరం పొలం పూర్తిగా అమ్మి ట్రీట్మెంట్ తీసుకున్నారు. దాదాపు నాలుగు నెలలపాటు హాస్పిటల్లో గడిపి ఇంటికి చేరుకొని ఫిజియోథెరపీ చేయించుకుంటున్నారు.తాను మాట్లాడలేరు,తన పని తాను చేసుకోలేడు, ఇలా గత రెండు సంవత్సరాలుగా నరకయాతన అనుభవిస్తున్నారు. కుటుంబం గడవడమే కష్టంగా మారి ఏదైనా పని చేసుకుందామని తన భార్య అనుకున్న తన భార్య కు నాలుగు ఆపరేషన్స్ కావడం వల్ల తనకు ఆరోగ్యం సహకరించడం లేదు ఒకవైపు భర్త మంచాన పడటం తో కుటుంబ భారం ఇబ్బంది గా మారి తన బిడ్డల చదువు ఆగమై అన్ని తానే చూసుకుంటుంది..ఎలాగైనా దాతలు ఆర్థిక సహాయం చేసి తన భర్త ప్రాణాలు కాపడాలని కోరుతున్నారు.

## ఉపాధ్యాయులపై దాడులు చేయడం తగదు

### జిల్లా కార్యదర్శి



**దోమ,జనవరి20ప్రభాతవార్త.** విదులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై దాడులు చేయడం తగదనిఅని టిఎస్.ఎస్‌టియు జిల్లా ప్రదానకార్యదర్శి షఫీ అన్నారు.తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పని చేస్తున్న ప్రదానోపాద్యాయులు రాములు పై దుండగులు దాడి చేయడం హేయమైనచర్య అని అన్నారరు.దాడి చేసిన దుండగులను వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నాడుమండల పరిదిలోని బోంపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో బోజనవిరామ సమయములో నల్ల బ్యాడ్జిలు దరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమములో మండల విద్యాదికారి వెంకట్,జిల్లా కార్యదర్శి ముత్యప్ప,పాఠశాల ఇంచార్జి ప్రదానోపాద్యాయులు ప్రవీణ్‌కుమార్, ఉపాద్యాయులు, అనంతయ్య, ఖయ్యుం, నరేందర్, మాదూరి, సరస్వతి,సావిత్రి పాల్గొన్నారు .

## నేటి నుంచి గ్రామ సభలు

**ధారూరు,జనవరి 20, ప్రభాతవార్త:** నేటి నుంచి ఈ నెల 23 తేదీ వరకు మూడు రోజులపాటు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు సోమవారం మండల అభివృద్ధి అధికారి నర్సింలు తెలిపారు. ఆయా తేదీలలో జరిగే గ్రామసభలలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, అర్హులందరికీ రేషన్ కార్డుల వివరాలు గ్రామ సభ ముందు ఉంచబడతాయనీ, ఎవరైనా ఏ పథకం కోసమైనా లబ్ధి చేకూరడం కోసం దరఖాస్తు చేసుకోవాలని భావిస్తే, వారు గ్రామసభలోనే ప్రత్యేకంగా ఏర్పరిచిన కౌంటర్లలో వారి దరఖాస్తులు ఇచ్చి రసీదు పొందవచ్చన్నారు. గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేక అధికారి, ప్రజా ప్రతినిధులు ,గ్రామ ప్రజలు ,యువజన సంఘాల సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు అందరూ పాల్గొంటారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్ అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## నేటి నుండి ప్రజా పాలన గ్రామసభలు

**దుద్యాల్,జనవరి 20, ప్రభాతవార్త:** మండలంలోని 21 గ్రామపంచాయతీలలో నేటి నుండి 24వ తేదీ వరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు కొరకు గ్రామసభలను నిర్వహించి గ్రామసభల ఆమోదం మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ఎమ్మార్వో కిషన్ తెలిపారు. ప్రభుత్వం ప్రజా పాలనలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల కొరకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను ఇటీవల సమగ్ర కుటుంబ సర్వేలో హౌస్ టు హౌస్ సర్వే చేసి లబ్ధిదారుల ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ ంండి 20వ తేదీ వరకు మండల అధికారుల ఆధ్వర్యంలో రెండవసారి ఫీల్డ్ సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశామని, నేటి నుండి 24 వ తేదీ వరకు 21 గ్రామపంచాయతీలలోని రెవెన్యూ, అగ్రికల్చర్, పంచాయతీరాజ్ అధికారులు గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. నేడు అల్లిఖాన్ పల్లి, లగచర్ల, ఈర్లపల్లి, సాగరం తండా, ఎక్కచెరువు తండాలలో.. 22 నాడు గౌరారం, చెట్టుపల్లి తండా, పోలేపల్లి, ఆలేడు లలో 23 నాడు నాజ్ ఖాన్ పల్లి, చి ట్యాల్ మైలారం, సత్తర్ కుంట తండా, హకీంపేట్, కుదురుమల్ల లలో 24 నాడు దుద్యాల్, రోటిబండ తండా, సంత్రకుంట తండా, హంసన్ పల్లి, సంగాయిపల్లి, హస్నాబాద్ లలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామసభలు జరిగే తేదీలలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సభలకు హాజరై లబ్ధిదారుల ఎంపికకు సహకరించాలని కోరారు.

## గ్రామసభలు విజయవంతం చేయాలి

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 20,(ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగ చేపట్టిన పథకాల అమలుపై ఏర్పాటు చేయనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ రైతు బరోసా, రైతు బరోసా, రేషన్‌కార్డులపై చేసిన సర్వే వివరాలను గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజలకు వివరించినున్నట్లు ఆయన తెలిపారు. గ్రామసభలలో ప్రజలను పూర్తి బాగస్వాములను చేయాలని అన్నారు. గ్రామంలో చేసిన సర్వే వివరాలను గ్రామసభలో వెల్లడించాలని పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జగదీశ్వర్, ఏఓ రాజేందర్‌రెడ్డి, ఎంపిఓ హన్మంత్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మారెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20సిహెచ్‌గూడ02: పమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 20,(ప్రభాతవార్త):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు మెనేజర్ వెంకటేష్ అన్నారు. సోమవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పద్మారం గ్రామంలో పిఎంఎఫ్ఎంఈ పథకం ద్వార మంజూరు అయిన పిండి, మిర్చీ గిర్నిని ఆయన ప్రారంబించారు. గిర్ని ఏర్పాటుకు 30శాతం సబ్సిడితో రెండు లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం నర్సింహా, మాజి సర్పంచ్ లక్ష్మిసుధా నర్సింహులు, మాజి ఎంపిటిసి రాములు, మంజుల, లక్ష్మీ, దేవయ్య, రమేష్, యాదయ్య, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా భూ సర్వే క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి

### 3 రోజుల పాటు గ్రామ సభలు ప్రజలు అందుబాటులో ఉండాలి
### మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్ కుమార్,

**మొయినాబాద్, జనవరి 20,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా కార్యాక్రమానికి వ్యవసాయ భూముల పరిశీలన గత ఐదు రోజులుగా మొయినాబాద్ మండలంలో గ్రామాల్లో మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్, మరియు రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ అధికారులతో కలిసి పూర్తి స్దాయిలో వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములులను సర్వేనిర్వహించారు.

గత ఐదు రోజులుగా ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కల్టర్ నారాయణ్ రెడ్డి ఆదేశాల మేరకు మండలలోని 28 రెవెన్యూ గ్రామాల్లో రైతులకు రైతు భరోసా అందించేందుకు కొనసాగుతున్న క్షేత్రస్దాయి పరిశీలను సోమవారంతో మొయినాబాద్ మండలంలో ముగిసిందని తెలిపారు, సోమవారం మండలంలోని అజీజ్‌నగర్, నాగిరెడ్డి గూడ, బాకారం, చిన్న షాపూర్ తధితరు గ్రామాల్లో సర్వే నిర్వహించామని తెలిపారు, వ్యవసాయ అధికారుల క్షేత్రస్దాయి బృందం సర్వే నిర్వహించి పరిశీలనలో వ్యవసాయ యోగ్యమైన భూములతో పాటు సర్వే నెంబర్ల వారిగా మారిన భూములను రోడ్లు, నేషనల్ హైవే కోరకు భూము సేకరించిన వివిధ రకాల సాగుకు అనువుగాని, భూములను వాణిజ్య పరంగా వినియోగిస్తున్న భూములను గుర్తించి నమోదు చేసామని తెలిపారు, తహసీల్దార్ గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు వ్యవసాయా అధికారిణి అనురాధ పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు మండల సర్వేయర్ అనంత జలజ, గిర్దవార్లు, రోజా, సుజీత్ రెడ్డి, ఏఈవోలు కుమార్, సునీల్, రెవెన్యూ సిబ్బంది, భాస్కర్, బాలక్రిష్ణ, ఎల్లయ్య, చిరంజీవి, స్దానిక గ్రామ వీఆర్ఏలు, సర్వేచైర్మెన్ జనార్దన్ తధితరులు పాల్గోన్నారు.28 గ్రామాల్లో క్షేత్రస్దాయి పరిశీలను పూర్తిఅయిందని, రేపటి నుండి రేపు మంగళవారం 21,2025 నుండి గ్రామాల్లో గ్రామ పంచాయితీల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని ప్రతి ఒక్కరు అందుబాటులో ఉండాలిన కోరారు,

# చరిత్రను సృష్టించగల సత్తా గ్రంథాలయాలదే..

**ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామిరెడ్డి**
**గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారోత్సవ సభ**



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామిరెడ్డి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (జనవరి 20) :** చరిత్రను మార్చగల, సృష్టించగల సత్తా గ్రంథాలయాలకు ఉంటుందని, సమాజంలో ఏ మార్పు అయినా గ్రంథాలయాల ద్వారా సాధ్యపడుతుందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామిరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ గ్రేడ్-1 శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభకు ఎమ్మెల్సీ కోదండరామిరెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చరిత్రను మార్చిన ఘనత గ్రంథాలయాలకు ఉందని, పుస్తకం హస్తభూషణం అని పుస్తకానికి ప్రపంచంలోనే ఒక ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఎక్కడ ఏ పుస్తకాలు లభించకపోయిన గ్రంథాలయాలు మనకు అవసరమైన పుస్తకాలు విజ్ఞానం ఎంతగానో లభిస్తుందని అన్నారు. గ్రంథాలయా నుండి ఎందరో ఎదిగారని ఎన్నో ఉన్నత స్థితుల్లో ఉన్నారని అన్నారు. గ్రంథాలయాలను అభివృద్ధి చేయడం ఎంతో కీలకమైన అంశమని, ఇది గురుతరమైన బాధ్యత అని గుర్తు చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా పూర్తి సమాచారాన్ని అందజేసే విధంగా గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. వర్తమాన అంశాలపై ఇక్కడ విద్యార్థులకు నగర పౌరులకు ప్రత్యేకంగా బోధన ఏర్పాటు చేయాలన్నారు. రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దీనిపై కూడా ప్రత్యేక కార్యక్రమాలు గ్రంథాలయాల ద్వారా ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రతి మండలంలో కొన్ని ముఖ్యమైన గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ కె. మదన్‌మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్‌లు నక్క బాల్‌రాజ్, వీరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి క్యూసెట్ ఖు, సంయుక్త కార్యదర్శులు కుమ్మరి చంద్రశేఖర్, సింగపాగ అనిల్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ గౌడ్, సభ్యులు పటేల్‌రోడ్డు ఫయాజ్, కత్తి చంద్రశేఖర్, కాట్న రాజేష్, కృష్ణారెడ్డి, శివరాములు యాదవ్, ఆలోనిపల్లి రాజు గౌడ్, రవి నాయక్, రేకల శ్రీకాంత్ గౌడ్, జుట్టు అనిల్ కుమార్, జేఏసీ నాయకులు టీజీ శ్రీనివాస్, కరుణాకర్, జనార్థన్, శ్రీశైలం, ప్రముఖ సామాజికవేత్త వంగూరి గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభల సన్నాహక సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేందర్ రెడ్డి

**యాచారం, జనవరి 20, ప్రభాతవార్త.** నేటి నుంచి జరిగే గ్రామసభలలో సంబంధిత శాఖల అధికారులందరూ హాజరుకావాలని ఎంపీడీవో నరేందర్ రెడ్డి కోరారు. సోమవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ పోలీసు మండల పరిషత్ కార్యాలయం వివిధ శాఖల అధికారులతో గ్రామసభల అవగాహన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పై గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులుగా జరిగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల నుండి దరఖాస్తు స్వీకరించి అర్హులైన వారిని గుర్తించాలని కోరారు. గ్రామ సభలకు అధికారులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. తాసిల్దార్ అయ్యప్ప, యాచారం సీఐ మధు, పి ఆర్ డి ఇ శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్సీ డీ ఈ రాజు, వ్యవసాయ శాఖ అధికారి రవినాథ్, పంచాయతీ సెక్రెటరీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెతుకు ఆనంద్‌కు గతుకుల రోడ్లు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా?

**-మాజీ ఎమ్మెల్యేపై సుధాకర్‌రెడ్డి మండిపాటు**

**వికారాబాద్, ప్రభాతవార్త:** మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌కు గతుకు రోడ్లు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా..గత బీఆర్ఎస్ పాలనలో ఎందుకు రోడ్లు నిర్మించలేరని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ రెండు దఫాలుగా పాలించిన సమయంలో వికారాబాద్ నియోజకవర్గంలో ఒక్క రోడ్డు నిర్మించలేరని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిన తరుణంలో తమపై విమర్శలు చేయడం సిగ్గు చేటని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ 5 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా పని చేశారని, ఆయన హయాంలో ఒక్క అభివృద్ధి పని వికారాబాద్ నియోజకవర్గంలో చేయలేరని విమర్శించారు. ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి అది బాగా లేదు..ఇది లేదు అంటూ విమర్శలు చేయడం సరైంది కాదని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ఖజానా ఖాళీ చేశారని, అయినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని తెలిపారు. ఉడా పేరుతో వికారాబాద్ పట్టణంతో భవిష్యత్తులో ఎంతో అభివృద్ధి చెందబోతుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రోడ్లపై పడ్డ గుంతలు సైతం పూడ్చలేని వారు..నేడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.నాయ కులు చిగుర్లపల్లి రమేశ్‌కుమార్, రెడ్యానాయక్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు అన్నదానం

**సిద్దిపేట అర్బన్, జనవరి 20,ప్రభాతవార్త :** జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం వాసవి క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం క్యాస లక్ష్మీబాలయ్య ఆర్థిక సహాయంతో అభయజ్యోతి మానోవికాస కేంద్రంలోని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి మర్యాల వాణి, అధ్యక్షులు మురంశెట్టి కుమార్, చిగుళ్లపల్లి మంజుల, సత్యనారా యణ, పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మాసోత్సవాలు

**మర్కుక్, జనవరి 20 (ప్రభాతవార్త):** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవా లలో భాగంగా మర్కుక్‌లో సోమవారం ఏఎస్ఐ రవీందర్, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో వాహనదారులకు, యువకులకు, ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. త్రిబుల్‌రైడింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, అతివేగంగా వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్, మద్యం తాగి డ్రైవ్ చేయడం ప్రమాదకరమని, ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలు కలిగివుండాలని తెలిపారు.



వేద విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విజయలక్ష్మీ

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

**డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (జనవరి 20) :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడ్ పరిధిలోని సబ్ సెంటర్ కిషన్‌నగర్ ఏరియాలోని శ్రీ జగద్గురువు పంచాచార్య వీరశైవ ఆగమ పాఠశాలలోని వేద పాండిత్యం నేర్చుకుంటున్న విద్యార్థులకు షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరము నిర్వహించారు. ఈ పాఠశాలలో చదువుతున్న 105 మంది విద్యార్థులలో 95 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, వారిలో జలుబు, దగ్గు, జ్వరం ఉన్న వారికి కావాల్సి న మందులను అందజేశారు. ఇందులో 33 మంది విద్యార్థులకు ల్యాబ్ పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ విజయలక్ష్మీ తెలిపారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి, సీజనల్ వాధ్యలు పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్య అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ ముస్తాక్ అహ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ రమ, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, ఏఎన్ఎం సుగుణ, ఆశలు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ మంద జగన్నాథ్‌కు ఘన నివాళి



**తలకొండపల్లి, జనవరి 20. ప్రభాతవార్త :** మాజీ ఎంపీ మంద జగన్నాథ్ దశ దిన కార్యక్రమం సోమవారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల నేతలు హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మంద జగన్నాథం గారి మరణం తెలంగాణ ఒక సీనియర్ రాజకీయవేత్తను కోల్పోయిందని తలకొండపల్లి నాయకులు తెలిపారు.పాలమూరు జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని అన్నారు. నాలుగు సార్లు ఎంపీగా అయన అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన సీనియర్ నాయకులు జి.సూదకర్, తలకొండపల్లి మాజీ ఎంపిపి లక్ష్మీదేవి రఘురాములు, తలకొండపల్లి మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య,వస్పుల జంగయ్య,పెరుమల్ల నరసింహ,శేఖర్ తదితరులు ఉన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**తలకొండపల్లి, జనవరి 20. ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ఫిబ్రవరి 7, 8, 9, జరిగే శ్రీశ్రీశ్రీ వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు స్థానిక శాసనసభ్యులు గౌరవ శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి గారు ఆలయ ధర్మకర్త శ్రీ జి.శ్రీనివాసమూర్తి చేతుల మీదుగా ఆహ్వాన పత్రిక ఎమ్మెల్యే గారి స్వగృహంలో ఆవిష్కరించడం జరిగింది తదనంతరం బ్రహ్మోత్సవాలకు శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి గారిని ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, నాయ కులు సి చెన్నారెడ్డి, పి అశోక్ బాబు, బీ నర్సింలు, ఎం.ఏ.అజీజ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెలక్షన్ ఎం.డి. ఆరిఫ్, ఎండి రహీం, ఆమనగల్ మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, కల్లు పెంటా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## రూ. 10 లక్షల జీవిత బీమా చెక్కు అందజేత



**తలకొండపల్లి, జనవరి 20. ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామ పరిధిలోని కర్కాస్ తండాకు చెందిన సభావత్ మన్ని,కి పోస్టల్ డిపార్ట్మెంట్ నుండి 10 లక్షల జీవిత బీమా చెక్కును పోస్టల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు.

## నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

**అక్కన్నపేట, జనవరి 20, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం లోని తుక్కగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబలి రాము లకు జరిగిన అన్యాయం పట్ల మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరసన కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తం గా జక్టో ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించడం జరిగిందని రాములకు అన్యాయం చేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జ్యోతి, రామణ్, బాబు, వెంకట నర్సయ్య, శంకర్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి

## క్రీడలతో మానసికోల్లాసం : ఎస్పీ నారాయణరెడ్డి

**వికారాబాద్, ప్రభాతవార్త:** క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం లభిస్తుందని జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి అన్నారు. ఇంటర్ జోన్‌లో గెలిచిన పోలీస్ క్రీడాకారులు జోన్ తరుపున జనవరి 28 నుండి ఫిబ్రవరి 01 వరకు కరీంనగర్‌లో జరగబోయే 3వ తెలంగాణ పోలీస్ గేమ్స్ పోలీస్ మీట్స్‌లో పాల్గొనున్న సందర్భంగా, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025లో గెలుపొందిన రెండు జిల్లాల పోలీస్ క్రీడాకారులకు సోమవారం ఛార్మినార్ జోన్ లోని రెండు జిల్లాలకు ఇంటర్ జోన్ క్రీడపోటీల ు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, 2025 ఆన్యువల్ స్పోర్ట్స్ ఖీ గేమ్స్ మీట్ లో జోన్ నుండి కోకో, కబడ్డీ, వాలీబాల్,టాగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, ఫుట్బాల్, బాస్కెట్ బాల్ లలో పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్ళు వున్న క్రీడలు, ఆటలలో రాణిస్తున్న పోలీసులు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలవాలని తెలిపారు. స్పోర్ట్స్ వలన పోలీసులకు మోటివేషన్ తో పాటు వాళ్లలోని నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు ముఖ్యం కాదని, క్రీడల్లో ఎంత ప్రతిభ కనబరిచారో ముఖ్యమని అన్నారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు, పని ఒత్తిళ్ళను అధిగమించి ఆరోగ్యంగా ఉంటారని ఎస్పీ తెలిపారు. ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులతో పాటు, క్రీడల నిర్వహణాధికారులను ఎస్పీ అభినందించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, ఏఆర్ డిఎస్‌పి వీరేశ్, ఇన్స్పెక్టర్‌లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు, ఆర్ఐ లు, ఎస్ఐ లు, ఆర్ఎస్ఐ లు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం పట్ల అవగాహన కల్పించాలి

**మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర**



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర

**ఆమనగల్లు జనవరి 20 ప్రభాతవార్త:** నేత్ర దానం పట్ల సమాజంలో నెలకొన్న అపోహలను తొలగించేందుకు ప్రజలకు మరింత అవగాహన కల్పించే బాధ్యతను స్వచ్ఛంద సంస్థలు స్వీకరించాలని ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారి పరీక్షి త్ నరేంద్ర అన్నారు. మరణానంతరం ఆరోగ్యవంతమైన కళ్ళను దానం చేస్తే మరో ఇద్దరు అంధులకు దృష్టి భాగ్యం కల్పించి వారి జీవితాల్లో వెలుగులో నింపవచ్చని ఆయన వివరించారు. అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారిని డాక్టర్ కళావతి గారి ఆదేశానుసారంగా సోమవారం ఆమనగల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రాంరెడ్డి లయన్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పరీక్షి త్ నరేంద్ర శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి మరోమారు పరోక్ష జీవనం పొందాలన్నారు. అవయవాలలో నేత్రాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. కంటి వైద్యులు ఎం. చంద్రశేఖర్ గారి ఆధ్వర్యంలో పాఠశాలు, గ్రామాలలో ఆశ వర్కర్ల ద్వారా నేత్ర వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి నేత్రదానం పట్ల ప్రజలకు అవగాహన కల్పించి నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చే విధంగా చైతన్య కలుస్తామని ఆయన పిలుపునిచ్చారు. కాగా శిబిరానికి హాజరైన 65 మందికి కంటి వైద్య నిపుణులు మెండేటి చంద్రశేఖర్‌గుప్త కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 22 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి అవసరమైన ఐఒఎల్ ఆపరేషన్లు ఎనుగొండలోని రాంరెడ్డి లయన్ ఐ ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తున్నట్లు పిఆర్‌ఓ పాష ఈసంధర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సంయుక్త కార్యదర్శి ఎంగలి బాలకృష్ణ, క్లబ్ పిఆర్‌ఓ ఎంఏ పాష, క్లబ్ సభ్యులు కొర్ని వెంకయ్య, హెల్త్ సూపర్వైజర్ తిరుపతిరెడ్డి, డిఇఓ విష్ణు, ఆస్పత్రి సిబ్బంది తదితరు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

**ఆదాయం రూ.15,25,194 నగదు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా కేంద్రంలోని మోహినిపురా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ హుండీని సోమవారం లెక్కించారు. డివిజన్ పర్యవేక్షకులు విజయలక్ష్మీ, ఆలయ వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్త, ఆలయ చైర్మన్ తిరునగరివెంకట రమేష్ విష్ణుల ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. 113 ఆలయ హుండీ లెక్కించగా రూ.15,25,194 నగదు రాగా టిజిబి బ్యాంక్‌లో జమ చేశారు. కార్యక్రమంలో వికాస్ తరంగిణి పాల్గొన్నారు.

## ఆలయ కమిటీ చైర్మన్‌కు సన్మానం

**హత్నూర జనవరి 20, ప్రభాతవార్త :** హత్నూర మండలం షేర్ ఖాన్ పల్లి గ్రామ పరిధిలోని పలుగు మీది నల్ల పోచమ్మ దేవస్థాన ఆలయ కమిటీ చైర్మన్ పి. మల్ల గౌడ్ ను సోమవారం సంగారెడ్డి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.జ్ఞానపికను అందజేశారు. నూతన చైర్మన్ ఆధ్వర్యంలో దేవస్థానం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో కళ్ళు గీత కార్మిక సంఘం నాయకులు . జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామా గౌడ్, రవిగౌడ్ సంగారెడ్డి మండలాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, నాయకులు పవన్‌గౌడ్ నారాయణగౌడ్, మల్లేశంగౌడ్, లచ్చగౌడ్, సుదర్శన్ గౌడ్, శేఖర్ గౌడ్, ప్రభువు గౌడ్, మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు

## జాతీయ రహదారి విస్తరణలో బాధితలకు న్యాయం చేయాలి

**విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు డిమాండ్**

**మేడ్చల్, జనవరి 20. ప్రభాతవార్త :** మేడ్చల్‌లోని 44వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు, ఇండ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని మేడ్చల్ బిజెపి సీనియర్ నాయకుడు నందారెడ్డి కోరాడు. మేడ్చల్ పట్టణంలోని మహేశ్వరీ పరమేశ్వరీ ఫంక్షన్ హాలులో బిజెపి నాయకులు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడ్చల్‌లో అత్యంత విలువ గల భూములో రోడ్డులో కోల్పోయిన పేదలకు ప్రభుత్వం గజానికి అందిస్తున్న రూ.11 వేలు సహాయం సరిపోదనె విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. స్పందించిన వారు ఇండ్లు భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగే విదంగా నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. దీంతో కలెక్టర్ బాధితులకు న్యాయం జరిగే విదంగా నష్టపరిహారం చెల్లిస్తామని హామి ఇచ్చారని తెలిపాడు. కాగా రోడ్డు విస్తరణలో నష్టపోతున్న వారికి తగిన నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌కు మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు శైలజతో పాటు జిల్లా నాయకులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్, నాయకులు లవంగ శ్రీకాంత్, జాకట ప్రేమ్‌దాస్, చెర్వుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, వేలూరి సంతోష్ గుప్త, వంశీ విజయ్, వంశీదర్‌రెడ్డి, పుష్పారెడ్డి, బాబు రాజు, అవినాష్, మహేష్, వెంకటేష్, ఈశ్వర్, అర్జున్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహేష్ మాల



మహేష్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (జనవరి 20) :** మాల మహానాడు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షాద్‌నగర్‌కు చెందిన మహేష్ మాలను నియమించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలో డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశానికి జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం సమస్యలపై మహేష్ మాల అలుపెరగని పోరాటం చేశారని, జాతి కోసం ముందుండి కొట్లాడిన వ్యక్తి అని, అతని సేవలు గుర్తించి మాల మహానాడు యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాల మాట్లాడుతూ అనునిత్యం మాల కుటుంబ సభ్యుల కోసం ఎలాంటి పిలుపునిచ్చినా వారి సమస్యల పట్ల పోరాటానికి సిద్ధంగా ఉంటానని తెలిపారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గ్రామాల్లో నేటి నుంచి గ్రామసభలు: ఎంపిడిఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ గీత

**ఘట్‌కేసర్, జనవరి 20, ప్రభాతవార్త: ఈనెల** 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ఎల్.గీతారెడ్డి పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మండల కార్యాలయంలోని ఎంపిడిఓ చా ంబర్‌లో సోమవారం గ్రామసభల నిర్వహణపై ఆమె అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ గీత మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులకు అర్హులను ఎంపిక చేసేందుకు నాలుగు రోజుల పాటు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించాలని ఆమె సూచించారు. ఈనెల 21న మాదారం, అంకుశాపూర్, మర్రిపల్లిగూడ, 22న అవుషాపూర్, ఘణాపూర్, వెంకటాపూర్, 23న ఎదులాబాద్, ప్రతాపసింగారం, కొర్రెముల, 24న చౌదరిగూడ, కాచవానిసింగారం గ్రామల్లో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సభల్లో ప్రజల నుంచి అర్హులైన వారి నుంచి ఇందిరమ్మఇండ్లు, రేషన్‌కార్డుల కోసం ధరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఈసమావేశంలో నాయబ్ తహశీల్దార్ టి.రాజేందర్, ఎంపిఓ రవినాయక్, ఎఈఓ జగదీష్, పంచాయతీ కార్యదర్శులు, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మోడల్ హౌజ్‌కు భూమిపూజ

**హుస్నాబాద్ రూరల్, జనవరి 20, ప్రభాతవార్త:** పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మా ణానికి శంకుస్థాపన చేసినట్లు మండల స్పెషల్ ఆఫీసర్ ఎ.వెంకటరెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఎండిడివో వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మం డల అధ్యక్షుడు బంక చందుతోకలిసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతుందని, పేదలు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇంటి పథకంలో ఇండ్లు మంజూరైన లబ్దిదారులకు ప్రభుత్వం విడతలవారీగా రూ 5లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల డిఈ శంకరయ్య, అధికారులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కవి వెంకట్‌కు రాష్ట్ర సంగీత కళా సాహిత్య సన్మానం

**కొమురవెల్లి, జనవరి 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత, కవి యాత్ర జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ రాష్ట్ర సంగీత, సాంస్కృతిక కళా సాహిత్య అభినందన పత్రం అందుకున్నారు. హైదారాబాద్‌లోని కూకట్‌పల్లి భారత్ వికాస పరిషత్ వేదికపై సోమవారం జరిగిన కళా సంగమం, సంగీత సాహిత్య సాంస్కృతికోత్సవంలో లోకసత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ, నిర్వాహకులు సుమలత, శ్రీ వాగ్దేవి కళాపీఠం వ్యవస్థాపకులు వెంపరాల వెంకటలక్ష్మీ, శ్రీనివాసమూర్తి తదితరులు చేతుల మీదుగా అభినందన పత్రం, సన్మానం అందుకున్నారు. అభినందన పత్రం, సన్మానం అందుకున్న వెంకట్‌ను గ్రామ మాజీ సర్పంచ్ చెరుకు రమణా రెడ్డి చేర్యాల, సిద్దిపేట, గజ్వేల్, కవులు కళాకారులు అభినందించారు.

### ఏడిఈపిటి పరీక్షలను విభిన్న భాషలకు విస్తరించిన అనంత్ నేషనల్ యూనివర్సిటీ

భారతదేశంలో మొట్టమొదటి మరియు ఏకైక బహుభాషా డిజైన్ ప్రవేశ పరీక్ష అయిన అనంత్ డిజైన్ ఎంట్రన్స్ అండ్ ప్రొఫిషి యెన్సీ టెస్ట్ (ఏడిఈపిటి)ను ప్రకటించింది, దీనిని ఇంగ్లీష్, హిందీ, గుజరాతీ, మరాఠీ, బెంగాలీ, కన్నడ, తమిళం, తెలుగు, మలయాళం మరియు పంజాబీ అనే 10 భాషలలో నిర్వహిం చనున్నారు. విభిన్న సాంస్కృతిక మరియు భాషా నేపథ్యాల నుండి వచ్చిన ఔత్సాహిక డిజైనర్లకు సమాన అవకాశాలు ఉండేలా, డిజైన్ విద్యను ప్రజాస్వామ్యీకరించడం పట్ల అనంత్ యొక్క అచంచలమైన నిబద్ధతను ఈ కార్యక్రమం నొక్కి చెబుతుంది. ఏడిఈపిటి 2025 జనవరి 26న ఆన్‌లైన్‌లో జరుగుతుంది.

# అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయండి

## తహసీల్దార్ ఆజం అలీ

**కేశంపేట జనవరి 20 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేల చూడాలని తహసీల్దార్ ఆజం అలీ అన్నారు. సోమవారం కేశంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశం మందిరంలో మండల అధికారులతో ప్రత్యక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి మూడు రోజులపాటు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని నేడు మంగళవారం అల్వాల, చౌలపల్లి, ఎక్లాస్కంపేట్, దత్తాయపల్లి, కాకునూరు, కేశంపేట, కొత్తపేట నిర్ద వెల్లి, పాపిరెడ్డి గూడ, తేదీ 22 బుధవారం లింగం ధన, బోదునంపల్లి, కోనాయిపల్లి, చింతకుంటపల్లి, ఇప్పలపల్లి, కొండారెడ్డి పల్లి, మంగలిగూడా, తూర్పు గడ్డ తండా, తొమ్మిది రేకుల, సంతాపూర్,పుట్టవానిగూడ, పోల్కొని గుట్ట తండా, తేదీ 23 బుధవారం వేముల నర్వ సుందరాపురం, పోమల్ పల్లి, సంగెం, పాటిగడ్డ, లే మామిడి, బైర్ఖాన్ పల్లి, దేవుని గుడి తండా, గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ ఆజం అలీ అన్నారు. గ్రామాలలో గ్రామసభలు నిర్వహించే సమయంలో గ్రామానికి చెందిన మాజా ప్రజా ప్రతినిధులు యువకులు, విద్యావంతులు పాల్గొని అధికారులకు సహకరించి గ్రామసభలను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి, ఎంపీ ఓ కిష్టయ్య, మండల వ్యవసాయ అధికారిని శిరీష, ఎస్సై రాజ్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ నర్సింగ్ రావు, మిషన్ భగీరథ ఏఈ నాగమణి,ఇరిగేషన్ ఏఈ గీత, ప్రదీప్, మరియు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయం ఏర్పాటు చేయండి



గ్రంథాలయం ఏర్పాటు చేయాలని చైర్మన్ కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**నందిగామ, జనవరి 20, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సోమవారం జిల్లా గ్రంథాలయాల అభివృద్ధి చైర్మన్ మధుసూదన్ రెడ్డికి నందిగామ మాజీ ఎంపీటీసీలు చంద్రపాల్ రెడ్డి, దేపల్లె కుమార్ గౌడ్ లు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ లతో కలిసి వినతి పత్రం అందజేశారు. రియల్ ఎస్టేట్ పరంగా, పారిశ్రామిక ప్రాంతంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నందిగామలో గ్రంథాలయం లేక యువతీ, యువకులు అటు షాద్నగర్ కు గాని, ఇటు కొత్తూరుకు గాని వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా నందిగామలో గ్రంథాలయం నోచుకోక నిరుద్యోగులైన విద్యావంతులు నష్టపోయిన దాఖలాలు ఉన్నాయన్నారు. మండల కేంద్రమైన నందిగామలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తే చుట్టూరా ఉన్న 10 గ్రామాల విద్యావంతులైన యువతి యువకులకు, విద్యార్థులకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని గ్రంథాలయ చైర్మన్కి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోవ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, అన్వర్, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.నేటి నుండి రైతు భరోసా గ్రామ సభలు (నందిగామ, జనవరి 20, ప్రభాతవార్త) నందిగామ మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో ఈనెల జనవరి 21, 22, 23 తేదీలలో మూడు రోజులపాటు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మొదలైన సంక్షేమ పథకాలపై గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుమతి తెలిపారు. ఈనెల 21 నందిగామ, అప్పారెడ్డిగూడ, అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ,బండోని గూడ,, బుగ్గనిగూడ, చేగూర్, రంగాపూర్, సిడితండా, మామిడిపల్లి, ఈదులపల్లి, 22 న మేకగూడ, వీర్లపల్లి, తాళ్లగూడ, వెంకమ్మగూడ, కన్హ, మోత్కుల గూడ, మామిడిపల్లి, 23నశ్రీనివాసులుగూడగ్రామపంచాయతీల్లో నిర్వహించే గ్రామసభలలో గ్రామస్తులు విధిగా పాల్గొనాలని ఆమె పేర్కొన్నారు.

## పల్లెలకు రానున్న పల్లె వెలుగు బస్సు

**22న సంఘీగూడలో ప్రారంభించనున్న ఎమ్మెల్యే**




**నందిగామ, జనవరి 20, ప్రభాతవార్త:** పల్లె వెలుగు బస్సులతో పల్లెలకు ప్రగతి కాంతులు రానున్నాయి. నందిగామ మండలం సంఘీ గూడ లో ఈనెల 22న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్ నగర్ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు ను ప్రారంభించనున్నట్లు మేకగూడ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సుక్య నాయక్ తెలిపారు. గత పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ సర్కార్ పల్లెలను పట్టించుకోలేదని విచారం వెలిబుచ్చారు. బస్సు సౌకర్యం లేక గ్రామీణులు పడుతున్న ఇబ్బందులను చూడలేక వారి కోరిక మేరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్ నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సును సంఘీ గూడలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. షాద్ నగర్ నుండి దూసకెల్, జేపీ దర్గా, ఇన్ముల్ నర్వ మీదుగా మేక గూడ గ్రామపంచాయతీ పరిధిలోని సంఘీగూడకు పల్లె వెలుగు రానుందన్నారు. పల్లెవెలుగు బస్సుతో ఆయాశాఖల అధికారులకు, విద్యార్థులకు, రైతులకు, కార్మికులకు, మహిళా సంఘాల వారికి, దర్గా భక్తులకు ఎంతో మేలు జరుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల తర్వాత పల్లె వెలుగు బస్సును పునరుద్ధరిస్తున్న షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## జీవన గమనాన్ని మార్చేది చదువే..

**-మండల విద్యాధికారి రాంచందర్**




స్వపరిపాలన నోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు,విద్యార్థులు

**చౌడపూర్ జనవరి 20 ప్రభాతవార్త :** చౌడపూర్ మండల పరిధిలోని మందిపాల్గ్రామం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి,ఘనంగా స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు.ముఖ్యఅతిథిగాపాల్గొన్న మండల విద్యాధికారి రాంచందర్ మాట్లాడుతూ,తమవిద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి చక్కటి ప్రతిభ కనబరిచారని, రాబోయే తరాలలో విద్యార్థులు ఉన్న స్థాయిలో ఉండాలని కోరారు. మనిషియొక్క జీవనగమనాన్ని మార్చేది విద్యనే అని, బాల్యంలో కేవలం విద్యపైనే దృష్టి సారించాలని విద్యార్థులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలోఅమ్మఆదర్శపాఠశాల చైర్మన్ యాదమ్మ నర్సింలు, ఉపాధ్యాయులుయాదయ్య, విజయ్, శ్రావణ్ రాందాస్, అనిల్, శ్రీను, జహీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## షాబాద్ లో కార్గో సేవలు ప్రారంభం

**షాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** షాబాద్ ఆర్టీసీ బస్టాండులో కార్గో సేవలను మహబూబ్నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇషాక్ బిన్ మహమ్మద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఆర్టీసీ కార్గో ద్వారా వినియోగదారులకు డోర్ డెలివరీ సదుపాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ ఆర్టీసీ డిపో డీఎంఈ శ్రీనివాస్, షాబాద్ ఆర్టీసీ బస్టాండు మేనేజర్ వెంకటేష్, కార్గో నిర్వాహకుడు మల్లేష్, మోహన్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పదవ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



**శంకర్పల్లి, జనవరి 20, ప్రభాతవార్త:** కబ్జాకోరల నుంచి తమ భూములను విడిపించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో 10వ రోజుకు చేరుకున్నాయి ఈ సందర్భంగా దీక్షలకు స్థానిక నాయకులు పలువురు మద్దతు తెలిపి మాట్లాడారు. గిరిజనుల 80 ఎకరాల భూమిని బడా బాబులు కబ్జా చేసి ఆక్రమించుకున్నారన్నారు. అధికారులను తమ చెప్పు చేతుల్లో పెట్టుకొని నిరుపేద గిరిజన రైతులపై కేసులు నమోదు చేయించి వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఆక్రమణదారులపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి గిరిజనులకు న్యాయంచేసే వరకుపోరాటం ఆపబమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాప్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మర్రి వాగు రాజు, పి.లక్ష్మణ్, రవి,శంకర్, బాబు, లక్ష్మణ్, చందర్, గోపి, సోనీబాయి, తులసి, గోమ, మున్న, శంకరమ్మ, మణెమ్మ, కవిత, తండావాసులు పాల్గొన్నారు.

# విజయరత్న సిబిఎస్ఈ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

**విద్యద్వారా ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చు: గాయకుడు చంద్రబోస్**




మున్సిపల్ చౌదరిగూడ విజయరత్న సీబీఎస్ఈ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతున్న సినీ గేయరచయిత, గాయకుడు కెఎస్. చంద్రబోస్

**ఘట్కేసర్ రూరల్, జనవరి 20, ప్రభాత వార్త:** తాము ఎంచుకున్న లక్ష్యం కొరకు పట్టుదలతో కృషి చేయడం ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని ప్రముఖ సినీగేయ రచయిత గాయకుడు ఆస్కార్ అవార్డు గ్రహీత కేఎస్. చంద్రబోస్ అన్నారు. పోచారం మున్సిపల్ చౌదరిగూడ పరిధిలోని విజయరత్న సిబిఎస్ఈ పాఠశాలలో ఆదివారం రాత్రి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ గాయకుడు రచయిత చంద్రబోస్ పాల్గొని మాట్లాడుతూ తాను చిన్ననాటి నుండి నమ్ముకున్నపాటనే ప్రపంచస్థాయి రచయితగా నిలబెట్టిందని అన్నారు. దాదాపు 870 సినిమాల్లో మూడు వేల 700లకు పైగా పాటలు వ్రాసినట్లు తెలిపారు. అందులో కొన్ని ముఖ్యమైన పాటలు వేదికపై పాడి ప్రేక్షకులను ఉర్రూతలుంగించారు. విద్యార్థులుక్రమశిక్షణతోకూడిన విద్యను నేర్చుకోవాలని,తాము ఎంచుకున్న లక్ష్యం కొరకు విద్యయే ప్రధానసాధనమని అన్నారు. విద్యద్వారా ఎక్కడైనా ఏ రంగంలోనైనా రాణించవచ్చని అన్నారు. విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథిచేత ప్రశంస పత్రాలు, మెమెంటోలు అందజేశారు.అంతకు ముందు పాఠశాల నిర్వహకులు పాఠశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన సంస్కాతిక కార్యక్రమాలు చూపరులను ఆలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె. విజయసేనా రెడ్డి, ఎం. నరేంద్రనాథ్, ఎం. నర్సింహారావు, కె. శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

## విహార యాత్రలతో విజ్ఞానం : ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్



గోల్కొండ కోటలో దండుమైలారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం, జనవరి 20, ప్రభాతవార్త:** విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు విజ్ఞాన విహార యాత్రలు ఎంతో ఉపయోగపడతాయని దండుమైలారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ అన్నారు. సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన విహార యాత్రలకు తీసుకెళ్లారు. ఈ యాత్రలో భాగంగా నగరంలోని సాలార్జింగ్ మ్యూజియం, గోల్కొండ, చార్మినార్, మక్కామసీదు, బిర్లా ప్రానిటోరియం, ట్యాంక బండ్ వంటి పర్యాటక ప్రాతాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రదానోపాధ్యాయుడు గోవర్ధన్ మాట్లాడుతూ.. విహారయాత్రలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ,విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, తెలియని జ్ఞాన సంపద తెలుసుకోవడానికి ఈ విజ్ఞాన విహార యాత్రలు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. అదేవిదంగా విద్యార్థులకు విహార యాత్ర సహకరించిన ఆసరా ఫౌండేషన్ చైర్మన్, హైదరబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు అరిశనపల్లి జగన్ మోహన్ రావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విహారయాత్రలో పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుండి గ్రామ సభలు ప్రారంభం

**ఇబ్రహీంపట్నం, జనవరి 20, ప్రభాతవార్త:** నేటి నుండి ఈ నెల 24వ తేది వరకు ఇబ్రహీంపట్నం డివిజన్ వ్యాప్తంగా 109 గ్రామ పంచాయితీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామ సభలు గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారుల అధ్యక్షతన జరగనుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకవచ్చిన ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోస, ఇందిరమ్మ ఆత్మీయ భరోస పథకాలు లబ్ధిదారులకు పారదర్శకంగా అమలు కోసం ఈ గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాల లబ్ధిదాలరుల ఎంపికపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలు స్వీకరంచనున్నట్లు వివరించారు. అదేవిదంగా గ్రామ సభలో ఇంతరవకు ప్రభుత్వ పథకాలను ధరఖాస్తు చేసుకోనివారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వచ్చందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆర్డిఓ అనంతరెడ్డి కోరారు.

### ఆశా వర్కర్లకు రూ.18 వేలు వేతనం ఇవ్వాలి

**-సిఐటియూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ**

**ఇబ్రహీంపట్నం, జనవరి 20, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో నేరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికాంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఆశాలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకపోవడం సిగ్గు చేటన్నారు. ఆశాల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పష్కరించాలని నేడు రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో జిల్లాలోని ప్రతీఒక్క ఆశా వర్కర్లు పాల్గొ విజవంతం చేయాలని కోరారు.

### విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేత

**కొండపాక, జనవరి 20, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల పరిధి లోని మెదినిపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు తిరుమల వెంకటరమణ ఆర్థిక సహకరంతో 5 మంది పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్లను సోమవారం అందించారు.

## వాసవి క్లబ్, వనతి క్లబ్




ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన వాసవి, వనిత క్లబ్ కమిటీ సభ్యులు

**షాద్నగర్, ప్రభాతవార్త, (జనవరి 20) :**వాసవి క్లబ్, వనిత క్లబ్ 2025 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. షాద్నగర్ పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలోవాసవి క్లబ్ అధ్యక్షుడిగా కల్వ మాణిక్యం, ప్రధాన కార్యదర్శిగా కొప్పూరి నవీన్కుమార్, కోశాధికారిగా గుబ్బసురేష్,వనిత క్లబ్ అధ్యక్షురాలిగా కల్వ పుష్పాంజలి, ప్రధాన కార్యదర్శిగా పిన్నం స్రవంతి, కోశాధికారిగా పాపిశెట్టి స్వప్నలచే డిస్టిక్ గవర్నర్ సరాబు అనంతం ప్రమాణస్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షుడు సహ కార్యదర్శులు, సభ్యులచే క్లబ్ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ వినాయక సంతోషి, కోశాధికారి గంగిశెట్టి నవీన్కుమార్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మీలు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగాదాత ఎలుకుర్తి నారాయణ, ఎలుకుర్తి శ్రీనివాసుల సహకారంతో విద్యార్థి పాఠశాల ఫీజు 12000 రూపాయలను విద్యార్థి తండ్రి బుచ్చయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా డిస్టిక్ గవర్నర్ అనంతం మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఏటా కోట్లాది రూపాయల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా వాసవి క్లబ్కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. షాద్నగర్కు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉందని, సేవా కార్యక్రమాలకు విస్తృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైస్ ప్రసిడెంట్ దొంతు పాండు రంగయ్య,ఇంటర్నేషనల్ ఆఫీసర్ సూరిశెట్టి నరసింహ్మా గుప్తా, వెంకటరమణ, బాలరాజేష్, గార్లపాటి నవీన్ కుమార్, పెంటపాటి శ్రీనివాస్,జడ్జీలు గుడిపల్లి వెంకటరమణ, కొందరమ, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గండిసురేష్, షాద్నగర్ పట్టణఅధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాస్,నాయకులు యంసాని శ్రీనివాస్, పెద్ది రాంమోహన్, పాల్గొన్నారు.

## నేటి నుండి మండలంలో గ్రామసభలు

**విలేకరుల సమావేశంలో**
**తాసిల్దార్ నాగార్జున, ఎంపిడిఓ శ్రీకాంత్**

**తలకొండపల్లి జనవరి 20 :ప్రభాకర్ వార్త;** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్రంలోని నిరుపేద లకు ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాలు అమలు చేసేందుకు పెద్ద ఎత్తున ఆయా గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులతో పరిశీలన జరుపుతున్నామని తలకొండపల్లి తహసిల్దార్ నాగార్జున, ఎంపీ డి వో శ్రీకాంత్ లు తెలిపారు. సోమవారం తలకొండపల్లి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో మండలంలోని అధికారులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుభరోసా పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన గైడ్లెన్ ప్రకారం గత కొన్ని రోజులుగా మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించామని మండలంలో మొత్తం 697 సర్వే నెంబర్ల లో 900 ఎకరాలు వ్యవసాయానికి యోగ్యం గాని భూమిగా గుర్తించామని, వారు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులలో 3006 మంది దరఖాస్తులు రాగా 12,511మంది ని గుర్తించి నిజమైన లబ్ధిదారులను పరిశీలించినట్లు వారు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 3000 మంది అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇప్పటివరకు 966 మందిని గుర్తించినట్లు వారు తెలిపారు. ఇంకా మండలంలో ఎవరైనా అర్హత ఉండి తమ పేర్లు ప్రభుత్వం అందజేసిన జాబితాలో లేకపోవడంతో ఆయా గ్రామాలలో జరిగే గ్రామసభలలో అందజేయాలని వారు సూచించారు. ఈ గ్రామసభలు ఈనెల 21 మండలంలోని తల కొండపల్లి, చంద్రధన, వెల్జాల్, జూలపల్లి, చుక్కాపూర్, గట్టు ఇప్పలపల్లి, ఖానాపూర్, చి పునుంతల, వెంకట్రావుపేట్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని మిగిలిన గ్రామాల్లో నేను ఈనెల 23 వరకు గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు వారు తెలిపారు. ఈ గ్రామసభలను మండలంలోని ప్రజలందరూ సద్వినియోపరుచుకోవాలని వారు సూచించారు.

## వెయ్యి గొంతులు..లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**-మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు పి.ఆనంద్ మాదిగ**



మాట్లాడుతున్న మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు పి.ఆనంద్ మాదిగ

**వికారాబాద్ రూరల్, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో ఫిబ్రవరి 7న జరుగనున్న వెయ్యి గొంతులు..లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు పి.ఆనంద్ మాదిగ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా వెయ్యి గొంతులు లక్ష డప్పుల ప్రచార రథయాత్ర ఈనెల 11న బషీరాబాద్ మండల కేంద్రంలో ప్రారంభమై వివిధ గ్రామాలు, మండలాలు తిరుగుతూ సోమవారం నవాబ్ పేట్ మండలం మీదుగా వికారాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆనంద్ మాదిగ మాట్లాడుతూ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రచార రథం మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభమై వికారాబాద్ జిల్లాలో అన్ని మండలాలు తిరుగుతూ పది రోజుల సమయం పట్టిందని, మాదిగ కవులు కళాకారులు రచయితలను డప్పు తో చైతన్యం చేసి హైదరాబాద్ లో జరగబోయే మహా ప్రదర్శనను విజయవంతం చేసుకోవటకై ప్రతి ఒక్క మాదిగ బిడ్డ డప్పు వేసుకుని ఫిబ్రవరి 7న హైదరాబాద్ కు తరలి రావలని అన్నారు. ఈ దేశంలో దళితులకు సామాజిక న్యాయం దక్కాలంటే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లు, దళితుల్లో ఉండబడే అట్టడుగు కులాలకు అందరికీ సమానంగా అందిన నాడే సామాజిక న్యాయం దక్కుతుందని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆనాడు ఈ రాజ్యాంగంలోని రిజర్వేషన్లను పొందుపరచడం జరిగిందని గుర్తు చేశారు. దళితుల్లో ఉండబడే అన్ని కులాలకు అందట్లేదని ఉద్దేశంతో భారత ప్రభుత్వం ఎన్నో కమిషన్లను వేసిందని, వేసినటువంటి అన్ని కమిష్న్ లు కూడా ఈ రిజర్వేషన్లు దళితుల్లో ఉండబడే మాదిగ, మాదిగ ఉపకులాలకు అందక సామాజిక న్యాయానికి చాలా దూరంగా ఉన్నారని నివేదికలు భారత్ ప్రభుత్వానికి అందించడం జరిగిందన్నారు. 1994 లోనే మందకృష్ణ మాది ఎమ్మార్పీఎస్ స్థాపించి అనేక ఉద్యమాలు చేసి చివరకు సుప్రీంకోర్టు ద్వారా ఈ రిజర్వేషన్లు వర్గీకరణ సాధించుకున్నారని అన్నారు. ఈ దేశంలోని అత్యున్నత న్యాయస్థానం అయినటువంటి రాజ్యాంగ ధర్మాసనం ఏడుగురు జడ్జీలచే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ రాజ్యాంగ బద్ధమైన సామాజిక న్యాయం అందరికీ అందాలనే ఉద్దేశంతో రాష్ట్రాలకు అధికారాలు ఇస్తూ ఎస్సి రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. కొంతమంది మాలలు దీని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న సందర్భంలో మరొక్కసారి రాష్ట్ర ప్రభుత్వానికి మాలలకు కనువిప్పు కలిగే విధంగా వేయి గొంతులు..లక్ష డప్పుల కార్యక్రమంతో వాళ్ల కళ్ళు తెరిచే విధంగా ఉద్యమించి హైదరాబాద్ నగరాన్ని డప్పులతో మారుమోగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుల ఎంఎస్పీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామచంద్ర మాదిగ, జాతీయ కళామండలి ఉపాధ్యక్షులు బచ్చలకూర స్వామి మాదిగ, మేడ్చల్ జిల్లా కళామండలి అధ్యక్షులు రామచంద్ర మాదిగ, ఎంఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాష్ మాదిగ, ఎంఎస్పి జిల్లా కార్యదర్శి డప్పు మహేందర్ మాదిగ, ఎం ఎస్ పి జిల్లా ఉపాధ్యక్షులు బి కృష్ణ, తాండూర్ నర్సింలు , ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి అంజి మాదిగ జిల్లా ఉపాధ్యక్షులు మల్కప్ప మాదిగ సీనియర్ నాయకులు రవికుమార్ మాదిగ, మహిళా నాయకురాలు అన్నపూర్ణ, పుష్పమ్మ వికారాబాద్ మండల ఇన్చార్జి శ్రీనివాస్ మాదిగ ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ ఎమ్మార్పీఎస్ మర్పల్లి మండల ఇన్చార్జి జగన్, ఎమ్మార్పీఎస్ దారూర్ మండలి ఇన్చార్జి గట్టేపల్లి రాజు, సర్పన్పల్లి ఆనంద్, మోమిన్ పేట్ మండల నాయకులు రవికుమార్, న్యాయవాది శంకర్, మహవీర్ బందయ్య తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ నాయకులపై ఆరోపణలు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్ తదితరులు

**ఘట్కేసర్ రూరల్, జనవరి 20, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ పరిధి కొర్రెముల రెవెన్యూ పరిధిలోని ఏకశిలా నగర్ వెంచర్కు కాంగ్రెస్ పార్టీకి, నాయకులకు ఎలాంటి సంబంధం లేదని ఆపార్టీ మండల అధ్యక్షుడు కర్రెరాజేశ్ అన్నారు. తమ పార్టీపై, నాయకులపై బిజెపి నాయకులతో పాటు ఇతరత్రావారు చేస్తున్న ఆరోపణలను సోమవారం మక్త గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఖండించారు. కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 739 నుండి 749 వరకు గల భూమిలో ఏర్పాటు చేసిన వెంచర్ దాదాపు 40 యేండ్ల క్రితం ఏర్పాటు అయిందని అన్నారు. ప్లాట్ల కొనుగోలుదారులు, భూ యాజమానులకు మధ్యన కోర్టు పరిధిలో కేసులున్నాయని అన్నారు. అట్టివాటిపై కొందరు రియల్ వ్యాపారస్తులకు కాంగ్రెస్ నేత మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్ రెడ్డి ప్రమేయం ఉందని మాజీ ఎంపిపి బిజెపి నేత వై. సుదర్శన్ రెడ్డి ఆరోపణలు చేయడం తగదని అన్నారు. గత 8 యేండ్లకుపైగా బీఆర్ఎస్ పార్టీలో ఉండి, మంత్రి, కలెక్టర్ అధికార యంత్రాంగం వారి చేతిలో ఉన్నపుడుఎందుకు ఏకశిలా వెంచర్ గురించి మాట్లాడలేదని ప్రశ్నించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి యేడాది కాలంలోనే వందకోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడం సరికాదని ఎక్కడ జరిగిందో చూపాలని ప్రశ్నించారు. లేదంటే ఎంపిపి హయంలో ఏన్ని పార్కు స్థలాలుఅన్యాక్రాంతమైనావో వెలికితీస్తామని అన్నారు. రాజకీయంగా ఎదగాలని ఉంటే పేదలపక్షాన ఉండి పోరాడాలని సంబంధం లేనివారిపై ఆరోపణలు చేస్తే సహించబోమని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్గ్రామశాఖ అధ్యక్షుడు కట్టా ఆంజనేయులు గౌడ్, మాజీ ఎంపిటిసి బాస్కర్ రెడ్డి, నాయకులు బోజిరెడ్డి, కందుల కుమార్, బైండ్ల జంగయ్య, పసులాది నర్సింగ్రావు, నర్సింహ గౌడ్, ఎం.రవి తదితరులున్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య



**నవాబుపేట జనవరి 20,ప్రభాతవార్త :** మండల పరిధిలోని నారేగూడ గ్రామానికి చెందిన రిటైర్డ్ హాస్టల్ వార్డెన్, సామాజిక నేత రత్నం ఆదివారం రాత్రి ఆకాల మృతి చెందారు. ఈ సందర్భంగా చెవేళ్ళ ఎమ్మెల్యే కాలెయాదయ్య, విద్యా మౌళిక సదుపాయాల కల్పన శాఖ మాజీ చైర్మన్ నాగేందర్గౌడ్. పలువురు దళిత నాయకులు మృతుడు రత్నం కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఘనంగా నివాళ్ళు అర్పించారు. కుటుంబ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిజేశారు. ఈ సందర్భంగా రత్న చేసిన సేవలను కొనియాడారు. పలువురు దళిత నాయకులుమాట్లాడుతూ రత్నం యువకునిగా ఉన్నప్పుడు ఆదర్శ భావాలతో దళితుల ప్రతి సమస్యపై స్పందించేవారని. అప్పట్లో ఆంగ్ల భాషపై మంచి పట్టున్న యువనాయకుడని అన్నారు. అదే తరహాలో అన్యాయాన్ని ఎదురించే గుండె ధైర్యం ఉన్న నాయకుడని వారు గుర్తుచేశారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు మెండుగా ఉన్న వ్యక్తని వారు కొనియాడారు. అనంతరం వార్డెన్గా ఉద్యోగం పొంది విద్యార్థులకు మెరెగైన సేవలు అందించారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు శివరాజు, శివ, సంజీవయ్య, మాజీ సర్పంచ్ పర్మయ్య, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

### లక్ష డప్పుల మోత మోగాలి వర్గీకరణ కోసం ప్రభుత్వం దిగిరావాలి



మండల కేంద్రంలో నిర్వహిస్తున్న డప్పుల ర్యాలీ

**నవాబుపేట జనవరి 20,ప్రభాతవార్త :** ఎస్సీవర్గీకణ సాధన కోసం ఫిబ్రవరి 7న హైద్రాబాద్లో నిర్వహించే అక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయగానికీ నిర్వహించిన డప్పుల యాత్ర సోమవారం మండల కేంద్రానికి చేకుంది. ఈ నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల నుండి మాదిగలు డప్పులతో మండల కేంద్రానికీ చేరుకుని యాత్రకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. కోతిబాపూలే, అంబేద్కర్, బాబుజగ్జీవన్రాం విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అప్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల నాయకులు మాట్లాడుతూ ఫిబ్రవరిన లక్ష డప్పుల మోతమోగాలని ప్రభుత్వం దిగివచ్చి ఇచ్చి హామి మేరకు వర్గీకరణ అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటిరే కాలాతీతమైయిందని జాగు చేయకుండా వర్గీకరణను అమలు చేయించి విజయం డప్పులను మోగించే విధంగా ప్రభుత్వం చూడాలని వారు డిమాండ్ చేశారు. మాదిగలు, ఉపకులాలు దశబ్దాల నుండి నష్టపోయింది చాలని ఇకనుండైనా వారి వాట వారికీ దక్కాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా నాయకుడు ఆనంద్మాదిగ, రవికుమార్మాదిగ,సినీయర్నాయకులు రాంచంద్రయ్య మాదిగ, జాన్మాదిగ, చంద్రంమాదిగ, రత్నంమాదిగ, కృష్ణమాదిగ, మండల అధ్యక్షుడు సుధాకర్మాదిగ, చంద్రంమాదిగ, ప్రకాశ్మాదిగ, బద్రిమాదిగ, నర్సింలు, యాత్ర నిర్వహణ కళాకారులు, పాల్గొన్నారు.

## 21 నుండి ప్రజాపాలన

**నవాబుపేట జనవరి 20,ప్రభాతవార్త :** ఈ నెల 21 నుండి 24 వరకు లబ్దిదారుల ఎంపిక క్రియను ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 న అక్నాపూర్, అర్కతల, ఎక్మామిడిరెవెన్యూ గ్రామం మమ్మదాన్పల్లి, చిట్టిగిద్దరైల్వేస్టేషన్, చిట్టిగిద్ద రెవెన్యూ గ్రామం, కేశవపల్లి, నాగిరెడ్డిపల్లి,గ్రామం, 22 న గంగ్యాడ, గుల్లగూడ, ఎల్లకొండ రెవెన్యూ గ్రామం, మూబారక్పూర్, తిమ్మారెడ్డిపల్లి, చిట్టిగిద్ద రెవెన్యూ గ్రామం, వట్టిమీనపల్లి, 23 న మాది రెడ్డిపల్లి, చిట్టిగిద్ద, గుబ్బడిఫత్తేపూర్, కద్చుర్ల, ఎక్మామిడి, యావపూర్, ఎల్లకొండ, నారెగూడ, రెవాన్యూ గ్రామం పూలపల్లి, 24 న అత్తాపూర్, చించల్పేట, పూలపల్లి, ఎత్రాజ్పల్లి, చిట్టిగిద్ద రెవెన్యూ గ్రామం, గేటువనంపల్లి, మైతాబ్ఖాన్గూడ, ఎల్లకొండ రెవెన్యూ గ్రామంఎల్లకొండ, కుమ్మరిగూడ, ఎక్మామిడి రెవెన్యూ గ్రామాల్లోప్రజాపాలనకార్యక్రమాలు నిర్వహించున్నట్లు ఎంపీడీవో చెప్పారు. మండల ప్రజలు నిర్ధేశించిన తేదిలను గుర్తించి అధికారులకు సహకరించాలనిఆమె కోరారు.

### నేటి నుంచి గ్రామ సభలు

**ధారూరు, జనవరి 20, ప్రభాతవార్త:** నేటి నుంచి ఈ నెల 23 తేదీ వరకు మూడు రోజులపాటు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు సోమవారంమండల అభివృద్ధి అధికారి నర్సింలు తెలిపారు. ఆయాతేదీలలో జరిగే గ్రామసభలలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మఇండ్లు, అర్హులందరికీ రేషన్ కార్డుల వివరాలు గ్రామ సభ ముందు ఉంచబడతాయనీ, ఎవరైనా ఏ పథకం కోసమైనా లబ్ది చేకూరడంకోసందరఖాస్తుచేసుకోవాలని భావిస్తే, వారు గ్రామసభలోనే ప్రత్యేకంగా ఏర్పరిచిన కౌంటర్లలోవారి దరఖాస్తులుఇచ్చి రసీదు పొందవచ్చున్నారు. గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేక అధికారి, ప్రజా ప్రతినిధులు,గ్రామ ప్రజలు,యువజన సంఘాల సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు అందరూ పాల్గొంటారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్ అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.